క్లుప్తంగా

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశవాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి శనివారం సర్పంచ్ బొమ్మగాని రాజేశం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం 'మన ఊరు–మన బడి' కార్యక్రమం ద్వారా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏ వినోద్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే సహించం



ఆందోళన చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారులో గల 124 సర్వే నంబర్‌లో పరిహారం చెల్లింపుల్లో రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని బీజేపీ మానకొండూర్ ఇన్‌చార్జ్ గడ్డం నాగరాజు పేర్కొన్నారు. దాచారం శివారులోని 124 సర్వే నంబర్ భూముల వద్ద రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పరిహారమిచ్చాకే భూసేకరణ చేయాలన్నారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి అక్రమాలకు తావులేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కో–ఆర్డినేటర్ సాన వేణు, మహేందర్, రవి, సంపత్, జ్యోతి, నారాయణరెడ్డి, శ్రీధర్‌రావు, ఆంజనేయులు, శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో గల హైస్కూల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కొండం సంజీవ్, ఆముదాల రంజిత్‌రెడ్డి, సంతోష్, నరేశ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోలీస్ రిక్రూట్మెంట్‌లో భాగంగా మల్టిపుల్ ఛాయిస్‌లో ఏడు మార్కులు కలపకుండా సీఎం కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేస్తున్నాడని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మార్గ సతీశ్‌గౌడ్, యూత్ జనరల్ సెక్రటరీ సాయి, యూత్ పట్టణ అధ్యక్షుడు సలీం, యూత్ నాయకులు గయాజుద్దీన్, మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహం

- ఘనంగా కొత్త సంవత్సరానికి స్వాగతం
- సందడిగా మారిన దుకాణాలు
- కిటకిటలాడిన బేకరీలు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బై బై 2022.. వెల్‌కమ్ టూ 2023.. అంటూ ఆంగ్ల నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారుల ఆటలు, పాటలు అలరించాయి. అదేవిధంగా యువకులు, యువతులు గుంపులుగా చేరి నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. కేక్‌లు కట్ చేసి, బాణాసంచా కాల్చి, నృత్యాలు చేస్తూ సంబురాలు నిర్వహించారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్‌లు వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. దీంతో వినియోగదారులు అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు బారులు తీరారు.



సిద్దిపేటలో దుకాణం వద్ద కొనుగోళ్ల సందడి



సిద్దిపేటలోని ఓ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రముఖ చిత్రకారుడు రుస్తుం వేసిన చిత్రం



సిద్దిపేటలో కేకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

డీసీసీబీ సేవలు వినియోగించుకోవాలి

సిద్దిపేటఅర్బన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) అందిస్తున్న సేవలను రైతులు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్ కోరారు. శనివారం మండలంలోని ఎల్లుపల్లి గ్రామంలో సర్పంచ్ జయశ్రీరమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గోవర్దన్‌రెడ్డి, మిట్టపల్లి పీఏసీఎస్ సీఈఓ ఎల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో బ్యాంక్ అందించే అన్ని రకాల సేవల గురించి అవగాహన పెంచుకోవాలని డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని అనంతసాగర్‌లో గ్రామస్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సరిత, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, సీఏ చంద్రం పాల్గొన్నారు.



ఎల్లుపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్

దుబ్బాకటౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆర్థిక సాధికారిత వైపు వెళ్లేలా కృషి చేస్తున్నట్లు డీసీసీబీ మేనేజర్ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామక్కపేటలో నాబార్డు సహకారంతో ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల పద్మప్రభాకర్, ఎంపీటీసీ శోభస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ ఎల్లం ఉన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశవాపూర్ గ్రామంలో ఐదు రోజులుగా రామస్వామి కొండపై కొలువై ఉన్న శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేశంలో గుర్తింపు పొందిన, పేరు ప్రఖ్యాతలు గడించిన ఆజంనగర్ విజ్ఞాన సరస్వతీ సంస్కృతి వేద పాఠశాల హెచ్‌ఎం నరహరాచార్యులు నేతృత్వంలో బ్రహ్మోత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రామస్వామి గుట్ట దిగువ భాగం నుంచి బ్రహ్మంగారు, గోవిందమాంబ, సిద్దప్ప, నంది లింగం విగ్రహాలను గుట్టపైకి ప్రత్యేక పల్లకిలో సన్నాయి మేళాలతో వేద మంత్రోచ్ఛారణలతో గుట్టపైకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు, ఆలయ వ్యవస్థాపకుడు కందారపు రమేశ్‌చార్యులు, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, సామాజిక సేవకులు కర్ణకంటి మంజులారెడ్డి, సర్పంచ్ బొమ్మగాని రాజేశం, పంచాయతీ కార్యదర్శి సుమలత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

ముందస్తు అరెస్ట్‌లు సరికాదు

హుస్నాబాద్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతను అక్రమ అరెస్ట్‌లు ఆపలేవన్నారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో అవకతవకలు జరిగాయన్నారు. ప్రభుత్వానికి 31 సెలబ్రేషన్ మీద ఉన్న ఇంట్రెస్ట్ యువత మీద లేదన్నారు. అరెస్ట్ అయిన వారిలో యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, శ్రీకాంత్, ప్రశాంత్, గణేశ్, విద్యాసాగర్, విశ్వతేజ తదితరులు ఉన్నారు.



హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు

నేటి నుంచి పూర్తిస్థాయి ప్లాస్టిక్ నిషేధం

చేర్యాల(సిద్దిపేట): పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నేటి నుంచి పట్టణ కేంద్రంలో పూర్తిస్థాయిలో నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి పలు రకాల ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. 120 మైక్రాన్ కంటే తక్కువ గల కవర్లను వాడొవద్దని, ఎవరైనా వాడినా అమ్మినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలి

గజ్వేల్‌రూరల్: ప్రజలంతా ఐక్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శేరుపల్లిలో సర్పంచ్ కనకయ్య ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అమరావతితో కలిసి ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా సమానంగా జీవించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో హక్కులను కల్పించారని తెలిపారు. గ్రామంలో సమస్యలేవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, ఎంపీడీవో మచ్చేందర్, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్, ఎస్ఐ శంకర్, ఆర్ఐ కృష్ణ, సంతోష్, నాయకులు గొడుగు స్వామి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్, గ్రామ కార్యదర్శి బిస్కిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

హక్కుల సాధనకు కృషి చేయాలి

సిద్దిపేటరూరల్: పౌరులు రాజ్యాంగంలోని అన్ని హక్కుల సాధనకు కృషి చేయాలని ఎమ్మార్వో శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలోని దళిత వాడలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా మొదటగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఎమ్మార్వో మాట్లాడుతూ.. కుల వివక్షతను, అంటరానితనాన్ని నిర్మూలించాలని అన్ని కులాల వారితో సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలయ్య , సర్పంచ్ రమేశ్, ఉపసర్పంచ్ కనకరాజు, ఎస్సై విటల్, హెడ్ కానిస్టేబుల్ మురళీ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్: పీఆర్టీయూకు సంబంధించిన 2023 కేలండర్‌ను శనివారం గజ్వేల్‌లోని మండల వనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. ఆ యూనియన్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఊడెం వేమారెడ్డి, లింగంగౌడ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ సునీత ముఖ్య అతిథిగా హాజరుకాగా మండల నోడల్ అధికారి వై.కృష్ణ, అహ్మదీపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కరీమొద్దిన్‌తోపాటు పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి కనకయ్యల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 2032 డైరీతో పాటు కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, సర్పంచ్‌లు శ్రీనివాస్, కనకయ్య, దశరథం, ఉపసర్పంచ్ బాలాగౌడ్, ఎంపీటీసీ భూములుగౌడ్, కుకునూరుపల్లి, జగదేవ్‌పూర్, గజ్వేల్ మండలాల ఎలక్ట్రీషియన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో శనివారం ముదిరాజ్ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర (మత్స్యశాఖ) కేలండర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు యాట యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కల్లూల్ భిక్షపతి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం పాల్గొని మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక, రాజకీయంగా ముదిరాజులు ఎదగాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవి, ముదిరాజు ప్రతినిధులు కనకయ్య, మల్లయ్య, రాజు, సత్తయ్య, శ్రీకాంత్, వెంకటేశం, ప్రసాద్ పాల్గొన్నారు.

నాస్తికుడు నరేశ్‌పై పీడీయాక్ట్ అమలు చేయాలి



హుస్నాబాద్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న స్వాములు



చేర్యాల(సిద్దిపేట): పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న స్వాములు

హుస్నాబాద్: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాస్తికుడు బైరి నరేశ్‌ను అరెస్ట్ చేసి పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అయ్యప్ప స్వాములు, వివిధ పార్టీల నాయకులు ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు వెంకటరమణ, కూతాటి విజయభాస్కర్, కర్ణకంటి నరేశ్, బీజేపీ నాయకులు అక్కు శ్రీనివాస్, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, తోట సమ్మయ్య, ఏఐఎఫ్‌బీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): బైరి నరేశ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం వర్గల్ మండలం గౌరారం వద్ద రాజీవ్ రహదారిపై గ్రామ భక్తబృందం ధర్నా నిర్వహించింది. కార్యక్రమంలో సీతారామాంజనేయ భజనమండలి, రేణుక ఎల్లమ్మ భజనమండలి సభ్యులు, తత్వమసి సేవా సమాజం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు పత్రం అందజేశారు.

కొండపాక(గజ్వేల్): నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని దుద్దెడలో అయ్యప్ప సేవా సమితీ, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి శనివారం నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితీ ఉపాధ్యక్షుడు గోనె రమేష్, ప్రధాన కార్యదర్శి చిలుముల వెంకటేశం, కోశాధికారి రాంచంద్రారెడ్డి, సహాయ కార్యదర్శి పెద్దంకుల నాగరాజు, సభ్యులు బూర్గుల సురేందర్‌రావు, జగదీశ్వర్, కనకరాజు, లక్ష్మణ్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు నరహరి, రమేశ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): కఠిన చర్యలు తీసుకోవాలంటూ పట్టణ కేంద్రంలోని అయ్యప్ప మాలధారణ స్వాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి పట్టణ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించిన స్వాములు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): హిందూ దేవుళ్లను కించపరిస్తే సహించేది లేదని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): నరేశ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రామాచారి, సదానందం, గోవర్దన్, కమ్మరి స్వామి, సాయి, సంజీవులు, చార్వాక కుమార్, చంద్ర కుమార్, గొల్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం బీజేపీ నాయకులు రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వాసర యాదమల్లు, జిల్లా అధికార ప్రతినిధి ఉప్పల కృష్ణమాచారి, ఓబీసీ మోర్చా నాయకుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

గజ్వేల్‌రూరల్: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో శనివారం పలువురికి ఎన్‌సీడీ మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వినయ్‌రెడ్డి, ఏఎన్‌ఎం నిరూపమ్, ఆశవర్కర్ సంతోషి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మంజూరు చేసిన (ఎన్‌సీడీ) మందుల కిట్లను శనివారం ఎంపీపీ సుగుణ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ నర్సింగరావు, వైద్యులు శ్రీకాంత్, నాయకులు నర్సింలు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం నాయకులు శేఖర్, రాజు పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం గజ్వేల్‌లో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతిర్మయి, మహేశ్, అబ్దుల్, నిరంజన్, తదితరులున్నారు.